
సాక్షి
కుమురం భీం
సోమవారం । 16 । డిసెంబర్ । 2024



పక్షుల కోసం అడవి బాట..

కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్‌లో శాఖ అధికారులు బర్డ్‌వాక్ ప్రారంభించారు. గత రెండేళ్లతో పోలిస్తే రెండునెలల ముందు నిర్వహించారు. 8లో▸



వైద్యం అందక అవస్థలు

చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండడంతో మండల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
26.5 /11.2

వాతావరణం

ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. చల్లగాలులు వీస్తాయి. రాత్రి ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రూప్–2 పరీక్షల నేపథ్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అధికారులు పరీక్షల విధుల్లో ఉన్నందువల్ల కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని ఆయన సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: తూర్పు జిల్లా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సునీల్ రావ్, కార్యదర్శిగా నిశాంత్ పాలకుర్తి, కోశాధికారిగా శ్రీకాంత్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా సీనియర్ వైద్యులు రమేశ్‌బాబు, సల్మాన్, శ్రీనివాస్, ఫయాజ్‌ఖాన్ ఎన్నికయ్యారు. కార్యక్రమానికి మంచిర్యాల, కుమురంభీం, కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మందమర్రి, లక్సెట్టిపేట, చెన్నూర్ పరిధిలో ఉన్న 60 మంది దంత వైద్యులు హాజరయ్యారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె ఆపేదిలేదని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక అన్నారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 ఏళ్లుగా తక్కువ వేతనంతో పనిచేస్తున్నామన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం, రూ.10 లక్షల జీవిత బీమా, ఆరోగ్యబీమా సౌకర్యం, పదవీ విరమణ బెనిఫిట్స్, 12 నెలల వేతన స్కేల్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ, యూఆర్ఎస్ సమగ్ర శిక్షా సిబ్బంది తుకారాం, మోహన్, గాగేష్, సంతోష్, రాజేశ్, ప్రశాంత్, మల్లేశ్, రమాదేవి, ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'చలో ఐటీడీఏ'

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ తొమ్మిది తెగల ఆధ్వర్యంలో ఈనెల 16న చేపట్టిన చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొలాం సంఘ నాయకులు టేకం భీంరావు, మానిక్‌రావు కోరారు. స్థానిక ప్రెస్‌భవన్‌లో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. మన్నెవార్లు, కొలాంల ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాల్లో ఎంతో తేడా ఉందన్నారు. యావత్ కొలాం సమాజం స్పందించి ఆత్మగౌరవం కాపాడుకోవడానికి చలో ఐటీడీఏను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాజు, తదితరులున్నారు.

'సర్దార్' సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: ఉక్కుమనిషి, తొలి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు వల్లబాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, బోనగిరి సతీశ్‌బాబు, కొట్నాక విజయ్‌కుమార్, సొల్లు లక్ష్మి, అరిగెల మల్లికార్జున్, ఖాండ్రే విశాల్, జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మకు నెట్‌వర్క్ తిప్పలు!

నిరుపేదల సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ గృహాల సర్వే జిల్లాలో ప్రహసనంగా మారింది. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల్లో సర్వే చేపట్టినప్పటికీ నెట్‌వర్క్ సమస్యతో 112 జీపీల్లో ఆన్‌లైన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. మరో పక్షం రోజుల్లో సర్వేతో పాటు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో సర్వే సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

- సొంతింటి కల సాకారం దిశగా ప్రభుత్వం చర్యలు
- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే
- జిల్లాలో వచ్చిన దరఖాస్తులు 1,51,712
- యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది
- సిగ్నల్ సమస్యతో అప్‌లోడ్ కాని వివరాలు..



కొఠారిలో యాప్‌లో సేకరించిన వివరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి(ఆసిఫాబాద్): ఇందిరమ్మ ఇళ్ల పథకం దరఖాస్తుదారుల వివరాలు సేకరణకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది. జిల్లాలోని 15 మండలాల్లో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,51,712 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని గతంలోనే ఆన్‌లైన్ చేశారు. గ్రామ కార్యదర్శులు ఆన్‌లైన్ ఆధారంగా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు. జిల్లాలోని ఆయా గ్రామాలు, పట్టణాలు, మున్సిపాలిటీ వారీగా సిబ్బంది పనిలో నిమగ్నమయ్యారు. రెండు వారాల్లో పూర్తి చేయాలన్న లక్ష్యంతో సర్వే కొనసాగుతోంది. కానీ నెట్‌వర్క్ సమస్యతో జిల్లాలో సర్వే వేగవంతంగా ముందుకు సాగడంలేదు. ఇప్పటి వరకు జిల్లాలో 8,537 ఇళ్ల సర్వే నిర్వహించగా.. 5,430 దరఖాస్తులు ఆన్‌లైన్ చేశారు.

వివరాల సేకరణ ఇలా..

సర్వే సిబ్బంది దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పూరిళ్లు, రేకుల ఇల్లు, పెంకుటిల్లు, అద్దె ఇల్లు, తదితరాల్లో నివాసం ఉంటున్న వివరాలు సేకరిస్తున్నారు. దరఖాస్తు దారుల కుటుంబ సభ్యులతో కలిసి ఫొటో సేకరిస్తున్నారు. ఇంటి లోపలిభాగం, పైభాగం వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దరఖాస్తుదారుడి ఇంటి నిర్మాణానికి స్థలం ఉంటే ఫొటో సేకరిస్తారు. అందుకు సంబంధించిన పత్రాన్ని ఫొటో తీస్తారు. గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధి పొంది ఉంటే వివరాలు ఆరా తీస్తున్నారు. కుటుంబంలో ఒంటరి మహిళ, దివ్యాంగులు, వితంతు మహిళలు ఉంటే సమాచారం సేకరిస్తున్నారు.

సిగ్నల్ లేక ఇబ్బందులు

జిల్లాలోని 112 గ్రామ పంచాయతీల్లో నెట్‌వర్క్ సమస్య తలెత్తుతోంది. దీంతో సర్వే వివరాలు నమోదు చేసే యాప్ పనిచేయడంలేదు. ఈ కారణంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ జరగడం లేదు. ఈ నెలాఖరు వరకు సర్వే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ నెట్‌వర్క్ సమస్యతో తాత్సారం జరుగుతోంది. అధికారులు తక్షణమే స్పందించి ఆఫ్‌లైన్ సౌకర్యం కల్పిస్తే తప్పా ఇబ్బందులు తొలిగేలా కనిపించడం లేదు. కాగా ఇంత పెద్ద జిల్లాకు కేవలం హౌసింగ్‌కు సంబంధించిన ఒక డీఈని మాత్రమే నియమించారు. మిగిలిన సిబ్బందిని నియమించక పోవడంతో పర్యవేక్షణ ఇబ్బంది కరంగా మరనుంది.

నియోజక వర్గానికి 3,500 గృహాలు..

ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు పూనుకుంది. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం మొదటి విడతలో సొంతంగా స్థలం ఉన్న లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయనుంది. ఇంటి నిర్మాణ దశలను బట్టి బిల్లులు విడుదల చేయనుంది. ఈ మేరకు ఆసిఫాబాద్ నియోజకవర్గానికి 3,500, కాగజ్‌నగర్ నియోజక వర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న నిరుపేదల్లో హర్షం వ్యక్తమవుతోంది.

జిల్లాలో మండలాల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు

మండలం	దరఖాస్తులు	పూర్తయిన సర్వే
ఆసిఫాబాద్	16,621	530
బెజ్జూర్	9,513	1,016
చింతలమానెపల్లి	9,433	733
జైనూర్	8,964	1,473
కాగజ్‌నగర్	15,471	623
కాగజ్‌నగర్ మున్సిపాలిటీ	10,890	575
కెరమెరి	9,806	330
కౌటాల	10,772	720
లింగాపూర్	4,070	220
పెంచికల్‌పేట్	5,086	502
రెబ్బెన	10,725	513
సిర్పూర్(టి)	8,381	280
సిర్పూర్(యు)	4,659	102
తిర్యాణి	7,266	201
వాంకిడి	11,276	719
మొత్తం	1,51,712	8,537

గడువులోగా పూర్తి చేయాలి



జిల్లాలో మూడు రోజుల క్రితం ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 31లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. కానీ జిల్లాలోని 112 గ్రామ పంచాయతీల్లో నో నెట్ వర్క్ సమస్యతో సర్వే కొనసాగడం లేదు. ఆఫ్‌లైన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదించాం. రెండు రోజుల్లో ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో సర్వే వేగవంతం అయ్యే అవకాశం ఉంది.

– ఆర్ వేణుగోపాల్, హౌసింగ్ డీఈ

కేతిని ఆశ్రమ పాఠశాలలో వండిన పప్పు



మొదటి రోజే.. నో మెనూ

చింతలమానెపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వసతి గృహాలలో కామన్ డైట్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించింది. కానీ రెండవ రోజే ఆదివారం మండలంలోని కేతిని ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు మెనూ ప్రదర్శించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు నీళ్ల చారు, ఆకుగోబి కూర అందించారు. ఈ విషయంపై సిబ్బందిని ప్రశ్నించగా శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు, అధికారులకు సమావేశం ఉండడంతో భోజనంలో చికెన్ అందించామని, దీంతో ఆదివారం కూరగాయ, పప్పు భోజనంలో అందించామన్నారు. శనివారం కోడిగుడ్ల కూర పెట్టాల్సి ఉండగా ఆదివారం సైతం అందించలేదు. సరైన భోజనం అందించడంలో క్షేత్రస్థాయిలో ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం ప్రభుత్వ లక్ష్యాలను నీరుగారుస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఆకు గోబి కూర

ప్రశాంతంగా గ్రూప్–2 పరీక్ష

- మొదటిరోజు 55 శాతం హాజరైన అభ్యర్థులు
- సెంటర్లను పర్యవేక్షించిన ఎస్పీ, కలెక్టర్
- నిమిషం నిబంధనతో ముగ్గురు వెనక్కి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో గ్రూప్–2 పరీక్ష మొదటిరోజు ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఆసిఫాబాద్‌లో 9, కాగజ్‌నగర్‌లో 9 సెంటర్లు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 8:30 నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగిన మొదటి పేపర్‌కు 4,393 మంది అభ్యర్థులకుగానూ 2,455 మంది హాజరుకాగా 1,938 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరిగిన పరీక్షకు 4,393 అభ్యర్థులకుగానూ 2,440 మంది హాజరుకాగా 1,953 మంది గైర్హాజరయ్యారు. నిమిషం నిబంధనతో జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ పాఠశాలలో ఒకరు, మోడల్ స్కూల్‌లో ఒకరు, గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఒకరు పరీక్ష రాయకుండా వెనుదిరిగి వెళ్లిపోయారు.

సెంటర్‌ల విజిట్ ....

జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల, మోడల్ స్కూల్, మాతృ శ్రీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌తో పాటు పలు సెంటర్‌లను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. గదుల్లో సరిపడా వెలుతురు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష అనంతరం ఓఎంఆర్ షీట్స్‌ను స్ట్రాంగ్‌రూంకు తరలింపులో పోలీసు సిబ్బందికి ఎస్పీ తగు సూచనలు ఇచ్చారు. నేడు నిర్వహించనున్న పరీక్షకు అన్ని సౌకర్యాలు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పేపర్లు పటిష్ట బందోబస్తు..

పరీక్ష పేపర్లను పోలీస్ బందోబస్తు మధ్య పరీక్షల నోడల్ అధికారి లక్ష్మీనరసింహ, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే కలెక్టరేట్‌లో ఉన్న స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లను కేటాయించిన పరీక్ష కేంద్రాలకు పటిష్టమైన బందోబస్తు మధ్య నిర్ణీత సమయంలో తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్ష పూర్తికాగానే ఓఎంఆర్ షీట్లను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త, రూట్ అధికారులు, పర్యవేక్షకులు, డీఎస్పీ, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

చలి పంజా



ఆసిఫాబాద్‌అర్బన్/దహెగాం: జిల్లాలో మూడు రోజులుగా చలిపంజా విసురుతోంది. దీంతో ఉదయం 10 గంటలు దాటినా ప్రజలు రోడ్లమీదకు రాని పరిస్థితి నెలకొంది. ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో చలి బారి నుంచి రక్షించుకునేందుకు చలిమంటలు కాగుతున్నారు. స్వెటర్ల దుకాణాల వద్ద జనం రద్దీ పెరిగింది. మరో వారం రోజులు చలి మరింత పెరిగే అవకాశం ఉన్నందువల్ల ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకుంటేనే మేలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

రాయితీ కోసం ఎదురుచూపులు

- జిల్లాలో పూర్తిస్థాయిలో అందని గ్యాస్ సబ్సిడీ
- కార్యాలయాల చుట్టూ మహిళల చక్కర్లు



ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా అందించాల్సిన వంటగ్యాస్ రాయితీపై క్షేత్రస్థాయిలో గందరగోళం నెలకొంది. రాయితీ ఎవరికి వస్తుందో.. ఎన్ని సిలిండర్లకు వస్తుందో.. అర్హతలను ఎలా నిర్ధారిస్తున్నారనే విషయం తెలియక, సరైన సమాధానం చెప్పేవారు లేక వినియోగదారులు నిత్యం ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు సైతం సరైన స్పష్టతలేకపోవడం గమనార్హం.

జిల్లాలో 1,39,562 కనెక్షన్‌లు

జిల్లా వ్యాప్తంగా భారత్, ఇండియన్, హెచ్‌పీ కంపెనీలకు సంబంధించిన 12 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 1,39,562 కనెక్షన్‌లు ఉన్నాయి. వీటిలో సింగిల్ కనెక్షన్‌లు 1,11,898, డబుల్ కనెక్షన్‌లు 27,664 వరకు ఉన్నాయి. ఇందులో చాలా వరకు వినియోగదారులకు రాయితీ అందని ద్రాక్షగానే మారింది. రాయితీలో తమకు సంబంధం లేదనే ధోరణిలో ఆయిల్ కంపెనీలు సమాధానం ఇవ్వడం శోచనీయం.

ప్రజాపాలనలో..

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించింది. బీపీఎల్ కుటుంబాలను గుర్తించి తెల్లరేషన్ కార్డు ప్రామాణికంగా అర్హులను ఎంపిక చేశారు. ప్రతీ కుటుంబానికి నెలకు ఒక సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ఇచ్చేలా ప్రభుత్వం నిబంధనలను రూపొందించింది. అయినప్పటికీ అర్హులైన చాలామంది వినియోగదారులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో రాయితీ అందడం లేదు.

పరిష్కారం ఎప్పుడో..

మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ఫలాలు వర్తించని కుటుంబాల కోసం దరఖాస్తుల సవరణకు(ఎడిట్) గానూ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాలు సైతం పరిష్కారం చూపించడం లేదు. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో వంటగ్యాస్ సిలిండర్ రాయితీ అందని వినియోగదారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నంబర్, ఎల్‌పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్ నంబర్లను సవరించుకునే వెసులుబాటు కల్పించారు.

సరైన ధ్రువపత్రాలు ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ సిలిండర్ కోసం ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులను సంప్రదించాలి. ఏమైనా పొరపాట్లు ఉంటే సరి చేసుకోవాలి. ప్రభుత్వం రాయితీ డబ్బులను ఆన్‌లైన్‌లో వినియోగదారుడి బ్యాంకు ఖాతాలోనే జమ చేయడం జరుగుతోంది.

– వినోద్, డీఎస్‌వో

సబ్సిడీ డబ్బులు రావట్లే



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు 6 సిలిండర్లు తీసుకున్నా. కనీసం ఒక్కసారైనా బ్యాంకు ఖాతాలో సబ్సిడీ డబ్బులు జమ కాలేదు. నా కూతుర్లు ఎంపీడీవో కార్యాలయం, గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి అడిగితే ఎవరూ సరైన సమాధానం ఇవ్వడం లేదు. ఎవరిని అడగాలో తెలియడం లేదు.

– చిచ్చోల్‌కర్ కమల, ఆసిఫాబాద్

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం



రూ.500లకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటి వరకు ఐదు సిలిండర్లు తీసుకున్నా. నేటికీ సబ్సిడీ డబ్బులు బ్యాంక్ ఖాతాలో జమకావడం లేదు. సబ్సిడీ డబ్బులు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– శంకరమ్మ, గోలేటి

మరోసారి పరిశీలన చేయాలి



ప్రభుత్వం రాయితీ కింద రూ.500లకే వంటగ్యాస్ ఇస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు రావడం లేదు. ఈకేవైసీ, ఆధార్ అనుసంధానం చేయించినా లాభం లేదు. తప్పని పరిస్థితుల్లో పూర్తి డబ్బులు చెల్లించి సిలిండర్ తీసుకుంటున్నాం. అధికారులు మరోసారి పరిశీలన చేసి రాయితీ అందేలా చొరవ చూపాలి.

– సంపూర్ణ, ఆసిఫాబాద్

ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

- సింగరేణి సీఎండీ ఎన్.బలరాం
- శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల్లో పర్యటన

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్: నిర్దేశిత వార్షిక ఉత్పత్తి లక్ష్యాలు తప్పనిసరిగా సాధించాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ నాయక్ సూచించారు. శ్రీరాంపూర్ ఓసీపీని, మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీపీని ఆదివారం సందర్శించారు. ఏరియాల జీఎంలు సూర్యనారాయణ, దేవేందర్, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అధికారులు టి.శ్రీనివాస్, మల్లయ్య సీఎండీకి స్వాగతం పలికారు. వ్యూపాయింట్ నుంచి పని ప్రదేశాలను చూపెట్టారు. ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తితోపాటు ఓబీ లక్ష్యాలను కూడా సాధించాలన్నారు. ఈ సంవత్సరం శ్రీరాంపూర్ ఓసీపీ 32 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాల్సి ఉందన్నారు. 330 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి కూడా వెలికితీయాలని తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత సాధించినప్పుడే సింగరేణి అభివృద్ధి చెందుతుందన్నారు. రక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఉత్పత్తి అయిన బొగ్గును సకాలంలో రవాణా చేయడం కూడా ఎంతో ముఖ్యమన్నారు. దీనికోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాల్సిన బాధ్యత కంపెనీపై ఉందని తెలిపారు. అనంతరం గని ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజీ, రక్షణ అధికారి శ్రీనివాస్, సర్వే అధికారి సంపత్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి సందర్శన..



అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియా పరిధి లోని రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆస్పత్రిని సీఎండీ బలరాంనాయక్ ఆదివా రం సందర్శించారు. పలు వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో మందమర్రి జీఎం దేవేందర్, శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ, ఏరియా ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, వైద్యాధికారులు, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని యువకుడు మృతి


సాయికుమార్ మృతదేహం

దండేపల్లి: లారీ ఢీకొని యువకుడు మృతిచెందినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని కొర్విచెల్మకు చెందిన బెంబడి సాయికుమార్(21) స్నేహితుడు రాజుతో కలిసి బట్టలు కొనేందుకు శనివారం బైక్‌పై లక్సెట్టిపేటకు వెళ్లారు. రాత్రి తిరిగి వస్తుండగా ముత్యంపేట నుంచి కొర్విచెల్మకు వెళ్లే రోడ్డు పక్కన బైక్ నిలిపి నిలబడి ఉన్నారు. ఇంతలో ముత్యంపేట నుంచి కొర్విచెల్మ వైపు వెళ్తున్న లారీని డ్రైవర్ తమీస్ అజాగ్రత్తగా, వేగంగా నడుపుకుంటూ వచ్చి సాయికుమార్‌ను ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన అతన్ని స్థానికులు అంబులెన్స్‌లో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. తల్లి పద్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని పులిమడుగు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పట్టణ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం..పులిమడుగుకు చెందిన జి.మల్లేశ్(32) కూలీ పనిచేసుకుని జీవిస్తున్నాడు. ఆదివారం తన బైక్‌పై మంచిర్యాల వైపు వెళ్తుండగా గ్రామంలోని సర్వీస్ రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం వేగంగా ఢీకొంది. తీవ్ర గాయాలైన అతన్ని మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెగాం వంతెన వద్ద మరొకరు..

భైంసారూరల్: మండలంలోని గుండెగాం వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మహాగాం గ్రామానికి చెందిన బాలాజీ పటేల్ (48) ఆదివారం రాత్రి సమయంలో భైంసా నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎడ్లబండిని ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిజామాబాద్ జిల్లాలో..

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం చిట్టాపూర్ శివారులో జాతీయ రహదారిపై బైక్‌ను వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. నిర్మల్‌కు చెందిన ఎండీ అద్నాన్ (20) తన మిత్రుడు షేక్ ఫైసల్‌తో కలిసి ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వీరి బైక్‌ను వెనక నుంచి వచ్చిన వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో అద్నాన్ తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆర్మూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. షేక్ ఫైసల్ గాయాలతో బయటపడ్డాడు. వ్యాన్‌తో సహా డ్రైవర్ పరారయ్యాడని ఎస్సై తెలిపారు.


మల్యాల వాచ్‌టవర్ వద్ద బర్డ్ వాచర్లు


పక్షులను కెమెరాలో బంధిస్తున్న పక్షి ప్రేమికులు

పక్షుల కోసం అడవిబాట

- కవ్వాల్‌లో బర్డ్‌వాక్
- తరలివచ్చిన పక్షిప్రేమికులు
- కొత్త అనుభూతిని పొందామని అభిప్రాయం

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్‌లో శాఖ అధికారులు ఆదివారం బర్డ్ వాక్ ప్రారంభించారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈసారి రెండునెలల ముందు నిర్వహించారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, నిర్మల్ తదితర జిల్లాలు, బిహార్, కర్ణాటక రాష్ట్రాల నుంచి పక్షి ప్రేమికులు తరలివచ్చారు. శనివారం రాత్రి మండలకేంద్రంలో బట్టర్ ఫ్లై గార్డెన్, జింకల పునరావాస కేంద్రం పర్యటన అనంతరం 15 మంది బర్డ్ వాచర్లను బైసన్‌కుంట ప్రాంతంలో డేరాలు వేసి రాత్రి బస ఏర్పాట్లు చేశారు. ఉదయం అల్పాహారం తర్వాత మల్యాల వాచ్‌టవర్ వరకు తీసుకెళ్లి అక్కడి నుంచి బైసన్‌కుంటకు తీసుకువచ్చారు. అక్కడ ఉన్న వివిధ రకాల పక్షులను తమ కెమెరాల్లో బంధించారు. రాత్రి అడవిలో బస చేయడం కొత్త అనుభూతినిచ్చిందని పేర్కొన్నారు. రాత్రి సఫారీ, ఫైర్‌క్యాంపు, డేరాల్లో నిద్రించడం కొత్త అనుభూతిని పంచిందని తెలిపారు. జన్నారం, ఇందన్‌పల్లి రేంజ్ అధికారులు సుష్మారావు, శ్రీనివాస్, డీఆర్వో తిరుపతిలు బర్డ్ వాచర్లకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు బర్డ్‌వాచర్లు సాక్షితో తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

కొత్త అనుభూతి



వీకెండ్ రోజుల్లో వేరే ప్రాంతాల్లో పర్యటిస్తాను. ఈసారి కొత్తదనం కోసం బర్డ్‌వాక్‌కు రావాలని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. శనివారం రాత్రి ఇక్కడికి చేరుకున్నాం. రాత్రి బైసన్‌కుంట వద్ద, అడవిలో గడపడం, ఫైర్ క్యాంపు, డేరాలు, ఉదయాన్ని పక్షుల అరుపులు, వాటిని చూడటం కొత్త అనుభూతి అనిపించింది.

– అజయ్, నిర్మల్

60 రకాల పక్షులను గమనించా



వీకెండ్ రోజుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లి బర్డ్‌వాచ్ చేస్తాం. ఫొటోగ్రఫీ అంటే ఇష్టం. కవ్వాల్ అడవుల్లో బర్డ్‌వాక్ అని తెలియగానే కూతురితో వచ్చాను. రాత్రి అడవిలో బస చేయడం ఆనందంగా ఉంది. రాత్రివేళ నక్కల అరుపులు, తెల్లవారుజాము పక్షుల అరుపులు మనస్సుకు హత్తుకున్నాయి. 60 రకాల పక్షులను గమనించాను. 35 రకాల పక్షులను కెమెరాకు చిక్కాయి.

– రాజేశ్, హైదరాబాద్

రాత్రి సఫారీ అనుభూతి ఇచ్చింది



ఇప్పటికి రెండుసార్లు బర్డ్‌వాక్‌కు ఇక్కడకు వచ్చాను. అనేక రకాల పక్షులను గమనించాను. ఈసారి రాత్రిసమయంలో సఫారీ చేయడం, బస చేయడం కొత్త అనుభూతి ఇచ్చింది. ఇక్కడ సూర్యుడు మూడు రకాల రంగులతో కనిపించడం అద్భుతంగా అనిపించింది.

– నాగేశ్వర్‌రావు, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ఫౌండర్, వరంగల్

సౌకర్యాలు కల్పించాం



ఈ సంవత్సరం మొదటిసారి బర్డ్‌వాక్ నిర్వహించాం. శుభకార్యాలు, చలి తీవ్రత వల్ల తక్కువ మంది వచ్చారు. బర్డ్‌వాచర్లకు బటర్‌ఫ్లై గార్డెన్ చూశారు. బైసన్‌కుంటలో వారికి బసతోపాటు భోజనం, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశాం. త్వరలో మరోసారి బర్డ్‌వాక్ ఏర్పాటు చేస్తాం.

– సుష్మారావు, రేంజ్ అధికారి

తుర్కం, యెంగన్న చెరువుల వద్ద బర్డ్‌వాక్


యెంగన్న చెరువులో పక్షులను కెమెరాల్లో బంధిస్తున్న సందర్శకులు

మామడ: మండలంలోని దిమ్మదుర్తి అటవీ అటవీరేంజ్ పరిధిలోని తుర్కం, యెంగన్న చెరువుల వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేచర్ వాక్, బర్డ్‌వాక్, సఫారీ కార్యక్రమాలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సుల్లో వచ్చిన వారి కోసం గుడారాలు ఏర్పాటు చేసి వసతులు కల్పించారు. కవ్వాల్ అభయారణ్యాన్ని, చెరువులను సందర్శించారు. శనివారం రాత్రి సమయంలో క్యాంపుఫైర్‌తోపాటు పర్యాటకులకు అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం ప్రత్యేక వాహనాల్లో సఫారీ నిర్వహించారు. చెరువుల వద్దకు వచ్చిన పక్షులను పర్యాటకులు తమ కెమెరాల్లో బంధించారు. 15 మంది పర్యాటకుల బృందం సభ్యులకు పక్షులగురించి అధికారులు వివరించారు. అధికారులు శ్రీనివాస్‌రావు, వేణుగోపాల్, శ్రీనివాస్, అన్నపూర్ణ పాల్గొన్నారు.


అటవీ ప్రాంతంలో వేసిన గుడారాలు

వలసపక్షుల కిలకిలలు

ప్రతిఏటా మాదిరిగానే ఈసారి వలసపక్షుల చెరువుల్లో సందడి చేశాయి. యూరప్, ఆఫ్రికా దేశాల నుంచి పక్షులు వస్తుంటాయని అధికారులు పేర్కొన్నారు. గ్రే హెడెన్ ఫిష్, ఎగిల్, పెరిగిన్ ఫాల్కన్, రెడ్ వైటెడ్, హాలి నెక్కడ్, పీకాక్, వుడ్‌పెక్కర్ పక్షులు కనిపిచాయి.


ఈగిల్ పక్షి

మంత్రాల్లేవ్.. సైన్స్ ఉంది


ప్రదర్శనలను తిలకిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా
- జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలు

ఆదిలాబాద్‌టౌన్: మంత్రాల్లేవ్.. తంత్రాల్లేవని.. సైన్స్ మాత్రమే ఉందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి తెలంగాణ చౌక్‌లో సైన్స్ కార్నివాల్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. కలెక్టర్ వాటిని తిలకించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అంతకు ముందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢనమ్మకాలకు సంబంధించిన వివిధ ప్రదర్శనలు ప్రదర్శించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీమంత్రి జోగు రామన్న, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రసాద్‌రావు, చీఫ్ సైంటిస్ట్ రాధ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా, రాష్ట్ర నాయకులు రవీందర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకాంత్, ఊశన్న, శ్రీధర్‌బాబు, నాగరాజు, సంతోష్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, ప్రొఫెసర్లు లక్ష్మారెడ్డి, రాంచంద్రయ్య, వెంకటేశ్వర్‌రావు, శ్రీనాథ్, ప్రసాద్‌రావు, రజిని, అందె సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జన్నారం: ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రామగుండం సీపీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ రాజుకుమార్ సిబ్బందితో కలిసి ఇందన్‌పల్లి కుమురంభీం చౌరస్తా వద్ద ఆదివారం తనిఖీ చేశారు. కలమడుగు వైపు నుంచి ఇంద్రవెల్లికి ఆటో ట్రాలీలో అక్రమంగా బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులో తీసుకుని విచారించగా మందపల్లికి చెందిన గుర్రాల రాజేందర్ అని తేలింది. పట్టుకున్న బియ్యం విలువ రూ. 36 వేలు ఉంటుందని తెలిపారు. బియ్యంతోపాటు ఆటోట్రాలీని సీజ్ చేసి జన్నారం స్టేషన్‌కు తరలించామన్నారు. తదుపరి విచారణ కోసం జన్నారం పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.


జన్నారం: పట్టుకున్న బియ్యం

భీమిని: కన్నెపల్లి నుంచి మంచిర్యాలలోని ఎన్టీఆర్ నగర్‌కు రెండు ఆటోల్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్సై గంగారాం తెలిపారు. ఆదివారం పక్కా సమాచారంతో రెండు ఆటోల్లో తరలిస్తున్న 6.50 క్వింటాళ్ల బియ్యాన్ని కన్నెపల్లి శివారులో పట్టుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. చింతల క్రిష్ణమనోహర్, వానరాశి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

కుంటాల: మండలంలోని కల్లూరు దత్త జయంతి సందర్భంగా నిర్వహించిన జాతరలో శనివారం తప్పిపోయిన బాలుడిని తల్లికి అప్పగించారు. కల్లూరుకు చెందిన శ్రీదేవి కుమారుడు అరుణ్ తప్పిపోగా, పోలీసులు గమనించి సోషల్ మీడియాలో వైరల్ చే యించి, ఆలయంలోని మైక్ ద్వారా వివరించారు. ఎస్సై భాస్కరాచారి ఆధ్వర్యంలో బాలుడిని తల్లి శ్రీదేవికి అప్పగించారు. దీంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పశువులు పట్టివేత

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువులను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. పక్కా సమాచారంతో అగర్‌గూడ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా బొలెరో వాహనంలో తరలిస్తున్న 8 ఆవులు, 1 ఎద్దును పట్టుకుని కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు తెలిపారు. పశువులను అక్రమ రవాణా చేస్తున్న మద్దెల గంగాధర్, సయ్యద్ అబ్బు, షేక్ రహమత్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నాలుగు జిల్లాల హాస్టల్ కన్వీనర్‌గా ఆకాశ్


ఆకాశ్

బోథ్: ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల విభాగ్ హాస్టల్ కన్వీనర్‌గా బోయిడి ఆకాశ్ నియమితులయ్యారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో ఇటీవల నిర్వహించిన విభాగ్ అభ్యాసవర్గలో విభాగ్ ప్రముఖ్ రేంజర్ల నరేశ్ ప్రకటించారు.

నేటి నుంచి ధనుర్మాసం


ముస్తాబైన చెన్నూర్ జగన్నాథాలయం

- ముస్తాబైన వైష్ణవ ఆలయాలు
- నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు
- ఈమాసంలో గోదా కల్యాణం, సుదర్శన హోమం

చెన్నూర్: విష్ణుమూర్తి ఇష్టమైన మాసం ధనుర్మాసం. వైష్ణవ ఆలయాల్లో నెలరోజుల పాటు ప్ర త్యేక పూజలు జరగనున్నాయి. ఇందులో భాగంగా చెన్నూర్ జగన్నాథాలయం ముస్తాబైంది. సోమవారం నుంచి ధనుర్మాసం ప్రారంభమై జనవరి 15న ముగుస్తుంది. ఈ మాసం ప్రారంభం నుంచి పండగ నెల అని అంటారు. భక్తులు శ్రీభూదేవికి (ఆండాల్) తిరుప్పావై పఠించడం అనవా యితీగా వస్తుంది. ఈ మాసంలో శుభకార్యాలు జరగవు. దైవిక కార్యలు మాత్రమే నిర్వహిస్తారు.

గోదాదేవి, రంగనాథుల కల్యాణం

ధనుర్మాసంలో గోదాదేవి రంగనాధుడి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. లోక కల్యాణార్థం లక్ష్మీరూపమైన గోదా రంగనాధుల కల్యాణ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తే అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని పురాణాలు చెబుతున్నాయి.

డిసెంబర్ 31న ముక్కోటి ఏకాదశి

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఈనెల 31న ధనుర్మాస శుద్ధ ఏకాదశినే ముక్కోటి ఏకాదశి అంటారు. ఈ సందర్భంగా వైష్ణవ ఆలయాలు ఉత్తర ద్వారం నుంచి స్వామివారి దర్శనం ఉంటుంది.

జనవరిలో సుదర్శన హోమం

ఏటా జనవరిలో చెన్నూర్ జగన్నాథాలయంలో సుదర్శన హోమం నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. ఈ హోమానికి పట్టణ భక్తులు కాకుండా పట్టణాల నుంచి వేలాది మంది తరలివస్తారు.

కోర్కెలు తీరుతాయి



ధనుర్మాసంలో మహా విష్ణువుకు ఉదయం స్నానమచరించి ఆరాధించాలి. ఈ మాసంలో గోదా కల్యాణం, సుదర్శన హోమాలు నిర్వహిస్తాం. ఈ మాసంలో స్వామిని కొలిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని నమ్మకం.

– దామెర మోహనాచార్యులు, అర్చకుడు, జగన్నాథాలయం

ఎరియర్స్, గ్రాట్యూటీ బెనిఫిట్స్ ఇప్పించాలి


సీతారామయ్యకు వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ కార్మికులు

మందమర్రిరూరల్: రిటైర్డ్ కార్మికులకు సింగరేణి యాజమాన్యం చెల్లించాల్సిన 11వ వేజ్ బోర్డ్ ప్రకారం పెన్షన్, ఎరియర్స్, గ్రాట్యూటీ తదితర బెనిఫిట్స్ ఇప్పించాలని కోరుతూ సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు. శనివారం సాయంత్రం ఏరియాలోని ఏఐటీయూసీ ఆఫీస్‌కు విచ్చేసిన సీతారామయ్యను రిటైర్డ్ కార్మిక సంఘాల నాయకులు కలిసి వారి ఇబ్బందులు వివరించారు. శంకర్, పీరయ్య, రాజమొగిళి, అశోక్, రాజయ్య, కొమురయ్య, కేదారి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆర్చరీ క్రీడాకారులు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

ఖానాపూర్: ఎంపీడీవో కార్యాలయం ఎదుట గల మైదానంలో ఆదివారం సబ్ జూనియర్స్ జోనల్ స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం, మంచిర్యాల జిల్లాలకు చెందిన సుమారు 30 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో ప్రతిభ కనబర్చిన జగన్, ఓంప్రకాశ్, సునిల్, బాలికల విభాగంలో రూపా, మీనాక్షి, జరు రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికయ్యారని కోచ్ అంబేత్‌కుమార్, ఎస్జీఎఫ్ కార్యదర్శి రవీందర్‌గౌడ్, పీడీ ఇమ్రాన్ తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

- జిల్లా కేంద్రంలో ఘటన

మంచిర్యాలక్రైం: అతివేగంతో వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. జిల్లాకేంద్రంలోని బైపాస్ రోడ్‌లో శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా రాథోడ్ ప్రదీప్‌కుమార్ పనిచేస్తున్నాడు. పట్టణంలో ఓ వివాహ వేడుక కోసం కారులో డ్రైవర్‌తో కలిసి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బోల్తాపడిన కారు అద్దాలను స్థానికులు పగులగొట్టి ప్రదీప్, డ్రైవర్‌ను బయటకు తీసి ధైర్యం చెప్పారు. కారును పక్కకు పెట్టారు. తర్వాత ప్రదీప్, డ్రైవర్ వెళ్లిపోయారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కారును స్టేషన్‌కు తరలించారు. కాగా, కారులో నుంచి మద్యం బాటిల్ లభించింది. ఈ విషయమై సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా కారు నంబర్ ఆధారంగా ర్యాష్ డ్రైవింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


బోల్తాపడిన కారును లేపుతున్న స్థానికులు

గ్రూప్-2 పరీక్షకు పాపతో వచ్చి..

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఆదివారం ప్రారంభమైన గ్రూప్-2 పరీక్షకు అభ్యర్థిని తన రెండు నెలల పసిపాపతో వచ్చింది. జైపూర్ మండలం ఇందారానికి చెందిన స్వాతి మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో పరీక్షకు హాజరైంది. కేంద్రం బయట పాపను అమ్మమ్మ రేణుకకు అప్పగించి పరీక్ష రాసింది. నాలుగు గంటల పాటు చిన్నారి తల్లికి దూరంగా ఉండడంతో గుక్కపెట్టి ఏడ్చింది. మధ్యాహ్నం స్వాతి వచ్చి పాపకు పాలుపట్టింది. అదే సమయంలో తల్లి రేణుక కూతురు స్వాతికి అన్నం తినిపించింది.


అమ్మమ్మతో పాప


కూతురికి తినిపిస్తూ..

సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

కెరమెరి: మండలంలోని తుమ్మగూడ పంచాయతీ కొలాంగూడలో ఆదివారం గ్యాస్ సిలిండర్ పేలి ఆత్రం బారిక్‌రావు ఇల్లు దగ్ధమైంది. కుటుంబ సభ్యులు కూరగాయలు, సరుకులు కొనుగోలు కోసం కెరమెరి వారసంతకు వెళ్లారు. చిన్నపిల్లలు ఇంటి ఎదుట ఆడుకుంటున్నారు. ఈనేపథ్యంలో ఒక్కసారిగా ఇంట్లో సిలిండర్ పేలి మంటలు అంటుకున్నాయి. గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. అప్పటికే గ్రామస్తులు నీళ్లు వేసి మంటలను అదుపులో తెచ్చారు. ఈ ప్రమాదంలో రెండు తులాల బంగారంతోపాటు పత్తి విక్రయించిన రూ.2 లక్షలు, దుస్తులు, ఇతరత్రా వస్తువులు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.